క్లుప్తంగా

రామాలయంలో విగ్రహ ప్రతిష్ఠ



విగ్రహ ప్రతిష్ఠ పూజల్లో ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

బిక్కవోలు: మండలంలోని కాపవరంలో నూతనంగా నిర్మించిన రామాలయంలో సీతారాముల విగ్రహ ప్రతిష్ఠ శనివారం నిర్వహించారు. ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి పాల్గొని స్వామి, అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ సత్యంశెట్టి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్ల మూకుమ్మడి రాజీనామా



కొమరిపాలెంలో రాజీనామా చేసిన వలంటీర్లు

బిక్కవోలు: సంక్షేమ సారథులుగా ప్రజల మన్ననలు అందుకుంటున్న వలంటీర్లపై ప్రతిపక్ష పార్టీల నిరంకుశ వైఖరిని నిరసిస్తూ మండలంలోని కొమరిపాలెం, ఆరికరేవుల గ్రామాలకు చెందిన వలంటీర్లు శనివారం మూకుమ్మడిగా రాజీనామా చేశారు. ఈ మేరకు తమ రాజీనామా పత్రాలను స్థానిక పంచాయతీ సిబ్బందికి అందజేశారు.

నందరాడలో ఎన్నికల ప్రచారం



నందరాడలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న డాక్టర్ రాజశ్రీ

రాజానగరం: నందరాడలో స్థానిక ఎమ్మెల్యే జక్కంపూడి రాజా సతీమణి డాక్టర్ రాజశ్రీ స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులతో కలిసి శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి గ్రామంలో గడచిన ఐదేళ్లలో జరిగిన అభివృద్ధిని, అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరిస్తూ ఎన్నికలలో ఫ్యాను గుర్తుకు రెండు ఓట్లు వేసి, ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు.

స్ట్రాంగ్ రూమ్‌లకు చేరిన ఎన్నికల మెటీరియల్



స్ట్రాంగ్ రూమ్‌కు తాళం వేసి, సీజ్ చేస్తున్న దృశ్యం

రాజానగరం: స్థానిక అసెంబ్లీ సెగ్మెంట్‌కి సంబంధించి పార్లమెంట్, అసెంబ్లీ బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, వీవీ ప్యాట్స్ ఆదికవి నన్నయ యూనివర్సిటీలోని స్ట్రాంగ్ రూమ్‌లకు భద్రంగా తరలించారు. వివిధ రాజకీయ పార్టీలకు చెందిన ప్రతినిధుల సమక్షంలో భద్రపరచిన అనంతరం ఆయా రూమ్‌లకు తాళం వేసి, సీల్ వేశామని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఆర్డీఓ ఎ.చైత్రవర్షిణి శనివారం రాత్రి ఒక ప్రకటనలో తెలిపారు. 216 పోలింగ్ కేంద్రాలకు సంబంధించి రిజర్వు యూనిట్స్‌తోపాటు 259 బ్యాలెట్ యూనిట్లు, 259 కంట్రోల్ యూనిట్లు, 280 వివి ప్యాట్స్‌ని భద్రపరిచామన్నారు.

అంబేడ్కర్‌కు ఘన నివాళి



శ్రీసత్య డ్రాయింగ్ అకాడమీ విద్యార్థులు గీసిన అంబేడ్కర్ చిత్రం

అనపర్తి: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని స్థానిక శ్రీసత్య డ్రాయింగ్ అకాడమీలో చిత్రలేఖనంలో శిక్షణ పొందుతున్న ముగ్గురు విద్యార్థులు అంబేడ్కర్ జీవిత ఘట్టాలకు సంబంధించిన చిత్రాలను గీసి ఆయనకు ఘన నివాళులర్పించారు. డ్రాయింగ్ టీచర్ మందపల్లి సత్యానందం పర్యవేక్షణలో అకాడమీకి చెందిన మందపల్లి శ్రీచరణ్, ఆర్.మౌనిక, వి.శివలీలలు వాటర్ కలర్స్, ఆయిల్ పేస్టులను ఉపయోగించి గీసిన అంబేడ్కర్ జీవిత ఘట్టాలు ఆకట్టుకున్నాయి.

19 నుంచి వేంకటేశ్వరుని కల్యాణోత్సవాలు

కడియం: స్థానిక కెనాల్ రోడ్డు రాజవీధిలోని శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామివారి కల్యాణోత్సవాలు ఈ నెల 19వ తేదీ నుంచి 21వ తేదీ వరకూ జరుగుతాయని ఆలయ కమిటీ చైర్మన్ దాసరి శేషగిరి తెలిపారు.

ఆలయాలకు నూతన శోభ

- నియోజకవర్గంలో దేవాలయాల పునర్నిర్మాణం
- ఎమ్మెల్యే జక్కంపూడి రాజా కృషితో మహర్దశ



కణుపూరులో పూర్తయిన రామాలయం



కలవచర్లలో నిర్మాణ దశలో ఉన్న శివాలయం

మధురపూడి: గ్రామాల్లో దేవాలయాలకు మహర్దశ పట్టింది. ప్రతి పల్లెలోనూ ఆధ్యాత్మిక పరిమళాలు వీస్తున్నాయి. పలు ఆలయాల పునర్నిర్మాణం, అభివృద్ధి పనులు చురుగ్గా జరుగుతున్నాయి. ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు జక్కంపూడి రాజా కృషితో శిథిల ఆలయాలు నూతన శోభను సంతరించుకున్నారు. నియోజకవర్గంలోని 117 దేవాలయాల పునర్నిర్మాణం చేపట్టారు. వీటిలో 30 దేవాలయాల నిర్మాణం పూర్తయ్యింది.

టీటీడీ శ్రీవాణి ట్రస్టు దాతృత్వం

పురాతన దేవాలయాల పునర్నిర్మాణం ద్వారా దైవభక్తిని పెంపొందించడానికి తిరుమల తిరుపతి దేవస్థానం కంకణం కట్టుకుంది. దాంట్లో భాగంగా రాజానగరం నియోజకవర్గంలో 117 దేవాలయాల పునర్నిర్మాణం చేపట్టనున్నారు. వాటిలో 70 దేవాలయాల పనులు చురుగ్గా జరుగుతున్నాయి. శ్రీవాణి ట్రస్టు ద్వారా ఒక్కో దేవాలయానికి రూ.10 లక్షలు చొప్పున ఆర్థిక సాయం అందజేస్తున్నారు. ఇప్పటికి 30 దేవాలయాల నిర్మాణం పూర్తి కాగా, మరో 35 నిర్మాణ దశలో ఉన్నాయి. మిగిలిన ఐదు దేవాలయాల నిర్మాణానికి శంకుస్థాపన పూర్తయ్యింది. ప్రతి గ్రామంలోనూ నూతన ఆలయ నిర్మాణం జరిగేలా చర్యలు తీసుకున్నారు. దేవదాయ, ధర్మాదాయశాఖ పర్యవేక్షణలో పనులు చురుగ్గా జరుగుతున్నాయి.

రంగనాథస్వామి ఆలయానికి రూ.2 కోట్లు

కోరుకొండలో అతిపురాతనమైన శ్రీరంగనాథ స్వామి దేవాలయం శిథిలావస్థకు చేరుకుంది. దానిని అభివృద్ధి చేయడానికి శ్రీవాణి ట్రస్టు ద్వారా రూ.2 కోట్లు విడుదల చేయనున్నారు. త్వరలో నిర్మాణ పనులు ప్రారంభమవుతాయి.

శ్రీలక్ష్మీనరసింహస్వామికి రాజగోపురం

కోరుకొండలోని శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో రూ.13 లక్షలతో రాజగోపురం నిర్మాణం చేపట్టనున్నారు. అలాగే కొండపైకి వెళ్లే మెట్ల మార్గాన్ని పునర్నిర్మించనున్నారు. దీనికోసం అన్నవరం దేవస్థానం రూ.60 లక్షలు కేటాయించింది. ఎన్నికల కోడ్ కారణంగా పనులు ప్రారంభం కాలేదు.

భక్తి భావం పెరిగింది



గ్రామాల్లో దేవాలయాల పునర్నిర్మాణంతో భక్తి భావం వెల్లివిరుస్తోంది. టీటీడీకి చెందిన శ్రీవాణి ట్రస్టు సేవలు అభినందనీయం. పల్లెల్లో గ్రామ దేవతల ఆలయాల నిర్మాణ పనులు జోరుగా జరుగుతున్నాయి.

– కర్రి నాగేశ్వరరావు, జెడ్పీటీసీ సభ్యుడు, కోరుకొండ

రాజా చొరవతోనే అభివృద్ధి



శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానానికి భక్తుల రద్దీ పెరుగుతోంది. ఆలయంలో రాజగోపురంతో పాటు కొండపైకి మెట్ల మార్గాన్ని పునర్నిర్మాణం చేయనుండడం అభినందనీయం. ఎమ్మెల్యే జక్కంపూడి రాజా చొరవతో ఆలయాలు అభివృద్ధి చెందుతున్నాయి.

– తాడి హరిశ్చంద్రప్రసాద్ రెడ్డి, కోరుకొండ

పాఠశాలకు క్రీడా పరికరాల బహూకరణ



హెచ్‌ఎం శ్రీనివాసరెడ్డికి క్రీడా పరికరాలు అందజేస్తున్న సంస్థ ప్రతినిధులు

బిక్కవోలు: మండలంలోని పందలపాక పడాల పెదపుల్లారెడ్డి జిల్లా ప్రజాపరిషత్ ఉన్నత పాఠశాలకు వాసు ఇనిస్టిట్యూట్, ఐటీసీ సంస్థల ప్రతినిధులు క్రీడా పరికరాలు బహూకరించారు. వాలీబాల్, షటిల్, చెస్, క్యారమ్స్, టెన్నికాయిట్, స్కిప్పింగ్ వంటి క్రీడలకు సంబంధించిన పరికరాలను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చిర్ల శ్రీనివాస్‌రెడ్డికి ఆయా సంస్థల ప్రతినిధులు శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు చిర్ల శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ క్రీడల్లో విద్యార్థులను ప్రోత్సహించడానికి సంస్థలు చేయూతనివ్వడం హర్షించదగిన విషయమన్నారు. కార్యక్రమంలో పాఠశాల పీడీ దార్వంపూడి యువరాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి చేశాం.. అండగా నిలవండి



ఈలకొలనులో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే సతీమణి ఆదిలక్ష్మి

- ఎమ్మెల్యే సతీమణి సత్తి ఆదిలక్ష్మి
- ఈలకొలనులో ఎన్నికల ప్రచారం

రంగంపేట: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో గతంలో ఎన్నడూ లేనంత అభివృద్ధి జరిగిందని, అందుకే ప్రజలు మళ్లీ వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి అండగా నిలవాలని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి సతీమణి, వైఎస్సార్ సీపీ నాయకురాలు సత్తి ఆదిలక్ష్మి అన్నారు. మండల పరిధిలోని ఈలకొలను గ్రామంలో శనివారం ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. తొలుత ఆమెకు జిల్లా పరిషత్ కో–ఆప్షన్ సభ్యుడు లంక చంద్రన్న, సర్పంచ్ చింతపల్లి సత్యనారాయణలు ఘన స్వాగతం పలికారు. పార్టీ అభిమానులు పూల వర్షం కురిపిస్తూ బ్రహ్మరథం పట్టారు. అనంతరం ఎమ్మెల్యే సతీమణి ఆదిలక్ష్మి గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గత ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీలన్నీ అమలు చేశారన్నారు. ప్రస్తుతం అమలవుతున్న సంక్షేమ పథకాలు యథావిధిగా కొనసాగాలంటే జగనన్నతోనే సాధ్యం అవుతుందని చెప్పారు. గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థను ఏర్పాటుచేసి సంక్షేమ పథకాలు ఇంటి ముంగిటకే అందేలా చేస్తున్నారన్నారు. గతంలో ప్రతి పనికి మండల కేంద్రానికి వెళ్లాల్సిన పరిస్థితి ఉండేదన్నారు. ప్రస్తుతం సచివాలయాల్లోనే పనులు జరుగుతున్నాయన్నారు. ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి గత ఐదేళ్లలో నియోజకవర్గాన్ని ఆదర్శంగా అభివృద్ధి చేశారన్నారు. అభివృద్ధి, సంక్షేమం కొనసాగాలంటే మళ్లీ వైఎస్సార్ సీపీకి మద్దతుగా నిలిచి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా, డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డిని ఎమ్మెల్యేగా ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు పేపకాయల రాంబాబు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి కొల్లాటి ఇజ్రాయిల్, రాష్ట్ర చేనేత, రైతు విభాగాల కార్యదర్శులు పాలాటి నాగేశ్వరరావు, రిమ్మలపూడి వెంకటేశ్వరరావు, అనపర్తి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ అడబాల వెంకటేశ్వరరావు, వైస్ ఎంపీపీ రాయుడు రాంబాబు, సొసైటీ చైర్మన్ లంక శివ తదితరులు పాల్గొన్నారు.

జగన్‌తోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం



కోరుకొండలో ప్రచారం సాగిస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, ఎంపీ అభ్యర్థి గూడూరి శ్రీనివాస్



కలవచర్లలో హారతులిస్తున్న మహిళలు

- కోరుకొండ నుంచి వైఎస్సార్ సీపీ ఎన్నికల ప్రచారం
- శ్రీలక్ష్మీనరసింహ స్వామికి పూజలు

మధురపూడి: రాష్ట్రాభివృద్ధి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డితోనే సాధ్యమవుతుందని, ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి మరోసారి ఆయనను ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలని ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, రాజానగరం ఎమ్మెల్యే అభ్యర్థి జక్కంపూడి రాజా అన్నారు. శనివారం రాజమహేంద్రవరం ఎంపీ అభ్యర్థి గూడూరి శ్రీనివాస్‌తో ఆయన ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టారు. ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్, వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి, పార్టీ యువజన విభాగం రీజనల్ కో–ఆర్డినేటర్ జక్కంపూడి గణేష్‌లతో ప్రచార రథాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానికులు హారతులిచ్చి ఘనంగా స్వాగతం పలికారు. తొలుత కోరుకొండలో వెలసిన శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో స్వామివారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ప్రచారానికి బయలుదేరారు. తాను చేసిన అభివృద్ధిని చూసి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని జక్కంపూడి రాజా కోరారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో పేదరికాన్ని రూపుమాపడానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేశారన్నారు. రాజానగరం నియోజకవర్గంలో రూ.1,773 కోట్లతో అభివృద్ధి, రూ.1,377 కోట్లతో సంక్షేమ పథకాలను అమలు చేసి లబ్ధిదారులకు అందించామన్నారు. నిరుపేదలు 20,200 మందికి ఇళ్ల స్థలాల పట్టాలిచ్చామని తెలిపారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో ప్రతి ఓటరుకు రెండు ఓట్లుంటాయని, ఒకటి తనకు వేయాలని, మరొకటి ఎంపీ అభ్యర్థి గూడూరి శ్రీనివాస్‌కు ఓటేసి అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ప్రచార రథం కోరుకొండ, జంభూపట్నం, నర్సాపురం, గాదరాడ మీదుగా రాజానగరం మండలం సీతారాంపురానికి చేరుకుంది. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ కర్రి నాగేశ్వరరావు, ఏఎంసీ నక్కా రాంబాబు, పార్టీ మండల కన్వీనర్ గణేశుల పోసయ్య, పార్టీ మాజీ కన్వీనర్ ఉల్లి బుజ్జిబాబు, వ్యవసాయ సలహా మండలి కోరుకొండ మండల చైర్మన్ క్రొవ్విడి సత్రాజు, వైస్ ఎంపీపీలు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

నిరంతరం మీలో ఒకడిగా మీతోనే ఉన్నా..

రాజానగరం: సాధారణంగా ప్రజాప్రతినిధులు ఎన్నికల సమయంలో తప్ప మిగిలిన రోజుల్లో ప్రజలకు అందుబాటులో ఉండరు.. అఖండ మెజార్టీతో ఎమ్మెల్యేనైన తరువాత గడచిన ఐదేళ్లలో నిరంతరం ప్రజల సమస్యలు తెలుసుకుంటూ, గ్రామాల అభివృద్ధి కృషి చేస్తూ ముందుకు సాగానని స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. సార్వత్రిక ఎన్నికల ప్రచారాన్ని శనివారం కోరుకొండ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో పూజలు చేసి ప్రారంభించారు. ప్రచారం రథంలో అక్కడ నుంచి మండలంలోని సీతారామపురం, కలవచర్ల, తూర్పుగానుగూడెంలలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీ అభ్యర్థి డాక్టర్ గూడూరి శ్రీనివాస్‌తోపాటు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

సీతారామచంద్ర మందిరం ప్రతిష్ఠ

ప్రకాశంనగర్: సీతారామచంద్ర మందిర ప్రతిష్ఠ మహోత్సవం శనివారం స్థానిక 3వ వార్డు సుబ్బారావుపేటలో ఘనంగా జరిగింది. మొదటి రోజు ప్రత్యేక పూజలు, అఖండ దీప స్థాపన తదితర కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంపీ, రాజమహేంద్రవరం వైఎస్సార్ సీపీ సిటీ అభ్యర్థిమార్గాని భరత్‌రామ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు నక్కా నగేష్, బళ్ల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కాంతి రేఖకు నంది పురస్కారం



గజ్జల వెంకటలక్ష్మిరెడ్డి చేతుల మీదుగా నంది పురస్కారం అందుకుంటున్న కాంతిరేఖ

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరు నేతాజీ నగర్‌కు చెందిన లుక్అప్ ట్రెండ్జ్ డైరెక్టర్ కె.కాంతిరేఖకు నంది పురస్కారం లభించింది. శనివారం ఫిలాంత్రోఫిక్ సొసైటీ ఆధ్వర్యంలో ధర్మంచర కమ్యూనిటీ హాల్ నిర్వహించిన ఉగాది నంది పురస్కారాల వేడుకలో ఆంధ్రప్రదేశ్ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ గజ్జల వెంకటలక్ష్మిరెడ్డి చేతుల మీదుగా ఆమె నంది పురస్కారాన్ని అందుకున్నారు. లుక్అప్ ట్రెండ్జ్ సంస్థను నెలకొల్పి మహిళా సాధికారిత కోసం ఎన్నో కార్యక్రమాలను, స్వయం ఉపాధి, మనో వికాసం కోసం 3 వేలకు పైగా మహిళలకు శిక్షణ ఇచ్చినందుకు ఈ పురస్కారం లభించిందని కాంతిరేఖ తెలిపారు. అమెజాన్‌లో బెస్ట్ సెల్లర్‌గా తాను రాసిన మోడరన్ ఉమెన్ గైడ్ బుక్ నిలిచిందని కాంతిరేఖ తెలిపారు.

వైభవంగా మరకత లింగ ప్రతిష్ఠాపన

ప్రకాశం నగర్: గౌతమ ఘాట్‌లోని అయ్యప్పస్వామి ఆలయ ప్రాంగణంలో శనివారం నూతనంగా ఏర్పాటు చేసిన మరకత ఉమామహేశ్వర లింగం ప్రతిష్ఠాపన మహోత్సవం వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి రాజమహేంద్రవరం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(రుడా) చైర్మన్ రౌతు సూర్యప్రకాశరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఉమామహేశ్వర లింగాన్ని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధి పాలసానపల్లి హనుమంతరావు, మాజీ కార్పొరేటర్ వాకచర్ల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రేపు ప్రజాస్వామ్య పరిరక్షణ సభ

ప్రకాశం నగర్: లౌకిక రాజ్యాంగ, ప్రజాస్వామ్య పరిరక్షణ సభను వై.జంక్షన్ వద్ద ఉన్న ఆనం రోటరీ హాల్‌లో సోమవారం నిర్వహించనున్నట్టు సీపీఐ, సీపీఎం జిల్లా కార్యదర్శులు తాటిపాక మధు, టి.అరుణ్ తెలిపారు. శనివారం స్థానిక మున్సిపల్ స్టేడియం వద్ద గల సీపీఐ కార్యాలయంలో ఇరు పార్టీల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో తాటిపాక మధు, టి.అరుణ్ మాట్లాడుతూ దేశంలో ప్రస్తుతం జరుగుతున్న పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని మతోన్మాదానికి వ్యతిరేకంగా లౌకిక రాజ్యాంగ, ప్రజాస్వామ్య పరిరక్షణ సభను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ సభకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ముఖ్య అతిథులుగా హాజరు అవుతున్నారని చెప్పారు. గౌరవ అతిథి గా కాంగ్రెస్ పార్టీ రాజమహేంద్రవరం పార్లమెంట్ అభ్యర్థి గిడుగు రుద్రరాజు హాజరుకానున్నారని తెలిపారు. సీపీఎం నగర కార్యదర్శి బి.పవన్, సీనియర్ నాయకులు ఎస్ఎస్ మూర్తి, సీపీఐ నగర కార్యదర్శి వి.కొండలరావు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన



సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న సీఐడీ అధికారులు

కంబాలచెరువు: సైబర్ క్రైమ్ ఎస్పీ మల్లికా గార్గ్ ఆదేశాల మేరకు రాజమహేంద్రవరం రీజనల్ ఆఫీస్ అడిషనల్ ఎస్పీ వి.గోపాలకృష్ణ స్థానిక ఆదిత్య డిగ్రీ కళాశాలలో శనివారం సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కళాశాల ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఈ సందర్భంగా సీఐడీ డీఎస్పీ పి.విజయ్‌కుమార్. సీఐడీ ఇన్‌స్పెక్టర్లు ఐ.గోపాలకృష్ణ, సీహెచ్ వెంకటేశ్వరరావు, డి.రమేష్‌బాబు, విజయ్ కుమార్ మాట్లాడుతూ సైబర్ నేరాలు జరుగుతున్న విధానాలను విద్యార్థులకు వివరించారు. వాటిని ఎలా అరికట్టాలి, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. పార్ట్ టైం ఉద్యోగం పేరుతో ఆన్‌లైన్‌లో మోసాలు ఇటీవల అధికమయ్యాయన్నారు. ఎవరైనా సైబర్ నేరగాళ్ల చేతిలో సొమ్ములు పోగొట్టుకుంటే వెంటనే సైబర్ క్రైమ్ హెల్ప్ లైన్ 1930కి ఫోన్ చేయాలన్నారు. 1930 నంబర్‌కు ఏ విధంగా ఫిర్యాదు చేయాలి, రిజిష్టర్ చేసుకోవాలో తెలిపారు. కార్యక్రమంలో రాజమండ్రి ఆదిత్య కళాశాల ప్రిన్సిపాల్ ఎస్కేఎస్ రెహమాన్. ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ జీవీఎస్ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రతిభ చాటిన విద్యార్థినికి సత్కారం



జ్యోతికను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ వేంకటేశ్వర్లు తదితరులు

కడియం: మురమండ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ద్వితీయ సంవత్సరం ఇంటర్మీడియెట్ పరీక్షా ఫలితాల్లో 975/1000 (ఎంపీసీ) మార్కులు సాధించిన పి.జ్యోతికను కాలేజీ అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది శనివారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ టీఎస్‌వీ వేంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రభుత్వ జూనియర్ కాలేజీ విద్యార్థుల్లో జ్యోతిక జిల్లా టాపర్‌గా నిలిచిందన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు ఎం.విజయకుమార్, బీఎస్‌వీ రామ్‌కుమార్, ఎంవీ రామాకృష్ణారావు తదితరులు సత్కరించారు. తమ కాలేజీ నుంచి సెకండియర్ బైపీసీలో కె.దుర్గా 769 మార్కులు సాధించిందన్నారు. ఎంపీసీలో కె.హేమ 864, ఎం.హరిప్రియ 823, ఎ.తబితా ఆషా 810, సీహెచ్ లహరి 756 మార్కులు సాధించారని పిన్సిపాల్ తెలిపారు.

తెలుగు క్యాలెండర్‌ను ఆవిష్కరించిన మంత్రి



తెలుగు క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి వేణు

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరులోని వైఎస్సార్ సీపీ రూరల్ నియోజకవర్గ కార్యాలయంలో శనివారం త్రైత సిద్ధాంత తెలుగు ఉగాది క్యాలెండర్(త్రైతశకం–46)ను రాష్ట్ర బీసీ సంక్షేమం, సమాచార పౌరసరఫరాలు, సినిమాటోగ్రఫీ శాఖమంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణు గోపాలకృష్ణ ఆవిష్కరించారు. త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక సభ్యులు మంత్రి వేణు గోపాలకృష్ణకు భగవద్గీతను బహూకరించారు. రాజమండ్రి కమిటీ అధ్యక్షుడు శేఖర్‌బాబు, హుకుంపేట సొసైటీ చైర్మన్ బొప్పన సుబ్బారావు, త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక సభ్యులు శేఖర్ బాబు, లక్ష్మీనారాయణ, జయరాం, గోవిందు, కె.లోకేష్, జగన్, మోహన్, సంధ్యారాణి, శోభారాణి, సూర్యకుమారి, కె.లక్ష్మీనారాయణ, కె.నరసింహమూర్తి, బి.భరత్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీని గద్దె దింపడమే లక్ష్యంగా పని చేయాలి

ప్రకాశం నగర్: విభజన హామీలు అమలు చేయని బీజేపీని గద్దె దింపడమే లక్ష్యంగా వామపక్ష పార్టీలు లౌకిక శక్తులు శక్తివంచన లేకుండా కృషి చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు పిలుపునిచ్చారు. శనివారం స్థానిక జట్ల సంఘం కార్యాలయంలో జట్ల లేబర్ యూనియన్ మేస్త్రీల సమావేశం యూనియన్ అధ్యక్షుడు కుంద్రపు రాంబాబు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ ప్రత్యేక హోదా, పోలవరం నిర్మాణం, నిర్వాసితులకు నష్ట పరిహారం ఇవ్వకుండా విభజన్ హామీలు అమలు చేయకుండా 5 కోట్ల ప్రజలను బీజేపీ ప్రభుత్వం తీవ్రంగా మోసం చేసిందన్నారు. రాజమహేంద్రవరం బీజేపీ ఎంపీ అభ్యర్థి పురందేశ్వరి ప్రచారినికి వస్తే తూర్పు ప్రజలు చెవిలో పువ్వులు పెట్టుకుని నిరసన తెలపాలని కోరారు. బీజేపీ పొత్తు పార్టీలను ఓడించి ఇండియా కూటమిని గెలిపించాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సంఘం ప్రధాన కార్యదర్శి సప్ప రమణ, సీపీఐ నగర కార్యదర్శి వి.కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎంలకు కట్టుదిట్టమైన భద్రత



స్ట్రాంగ్ రూమ్‌లను సీజ్ చేస్తున్న దృశ్యం

రాజమహేంద్రవరం సిటీ: రాజమహేంద్రవరం సిటీ అసెంబ్లీ నియోజకవర్గ ఈవీఎంలను, బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లను కట్టుదిట్టమైన ఏర్పాట్లతో భద్రపరిచినట్లు రిటర్నింగ్ అధికారి, నగర పాలక సంస్థ కమిషనరు కె.దినేష్ కుమార్ శనివారం తెలిపారు. ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి చేసిన తర్వాత సిటీ అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి 310 ఈవీఎంలు, 285 కంట్రోల్ యూనిట్లు, 285 వీవీపాట్‌లను ఎస్‌కేవీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని మొదటి అంతస్తు నందు వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో సీలు వేయడం జరిగిందన్నారు. పార్లమెంటరీ నియోజకవర్గంలోని అర్బన్‌కు సంబంధించిన ఎన్నికల సామగ్రిని స్ట్రాంగు రూంలో ఉంచి సీలు వేసి గట్టి పోలీస్ భద్రత ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు అర్బన్ కె.ఆంజనేయులు, ఎన్నికల సిబ్బంది, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.